క్లుప్తంగా

సన్మానం



ములుగు రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొలువు సంపాదించిన ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి వుల్లెరావు సునీల్‌ను సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి గఫూర్‌పాషా, గిరిజన సంఘం నాయకుడు రాజు మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసించి కొలువు సాధించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అనంతరం పూర్వ సునీల్ మాట్లాడుతూ.. విద్యార్థి సంఘం నేర్పిన క్రమ శిక్షణతో ఉద్యోగం సాధించడం సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకుడు ప్రవీణ్, కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవిగౌడ్, బుర్ర శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి, రంజిత్, మను తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి



వాజేడు: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వర్ధంతిని మండల కేంద్రంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్, దేవయ్య, ముత్తయ్య, సౌమ్య, అనిల్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక



వాజేడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో సీపీఐ నిర్మాణ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నల్లెబోయిన రవీందర్, జాయింట్ కార్యదర్శిగా గగ్గురి రాంబాబుతో పాటు 15 మంది సభ్యుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు, కొప్పుల శ్రీను, ఆచంటి ప్రసాద్, బట్టి సంతోష్, రమేశ్, సరోజిని, వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్రీను ఉన్నారు.

దళితుల భూములను ఇప్పించాలి



మంగపేట: మండలంలోని కమలాపురంలో దళితులకు చెందిన వెట్టి చాకిరి భూములను ఇప్పించాలని టీఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు గాజర్ల రాజు డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు శనివారం వనతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. గ్రామంలోని దళితులకు వెట్టిచాకిరి కింద ఇచ్చిన సర్వే నంబర్ 23లో గల 3.19 గుంటల లంక భూమి ఉందన్నారు. దానిని కొందరు పెద్ద మనుషులు కలిసి దళితుల వద్ద నుంచి ఒక వ్యాపార వేత్త గరికపాటి మోహన్‌రావుకు అమాయక దళితుల సంతకాలు తీసుకుని అప్పగించినట్లు ఆరోపించారు. తిరిగి ఆ భూమిని దళితులకు ఇప్పించాలని కోరారు.

'నేతకాని కులస్తులకు అన్యాయం'



వెంకటాపురం(కె): ఎస్సీ వర్గీకరణతో నేతకాని కులస్తులకు అన్యాయం జరుగుతుందని నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఏజెన్సీలో నేతకాని కులస్తులకు ఏజెన్సీ చట్టాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామటెంకి జానకిరావు తదితరులు ఉన్నారు.



పస్రాలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద



కన్నాయిగూడెం: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



మంగపేట: బోరునర్సాపురంలో..

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

గోవిందరావుపేట: తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద అన్నారు. మండలంలోని చల్వాయిలో అంగన్‌వాడీ టీచర్ అరుంధతి ఆధ్వర్యంలో, పస్రాలో హెల్త్ సూపర్‌వైజర్ డా.శ్రీకాంత్, డా.రణధీర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చల్వాయి గ్రామంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. పస్రాలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి సూపర్‌వైజర్ శారద హాజరై మాట్లాడారు. తల్లి పాలు ఇవ్వడం వలన పిల్లలకే కాకుండా తల్లులకు కూడా ఉపయోగం ఉంటుందని అన్నారు. అలాగే వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్ మాట్లాడుతూ.. హెచ్ఐవీతో ఉన్న తల్లి కూడా పిల్లలకి పాలు ఇవ్వవచ్చని అన్నారు. తల్లి పిల్లలకు పాలు ఇవ్వడం వలన పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లులకు రొమ్ము కేన్సర్ రాకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌశిక, అనూష, ఊర్మిళ, పద్మావతి, భాగ్య, సుజాత ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: పుట్టిన పిల్లలకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక వైద్యులు అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఆస్పిరేషన్ బ్లాక్ కోర్డినేటర్ రవీష్‌తో కలిసి వైద్యులు అభినవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే పల్లిపాలను తప్పక అందించాలన్నారు. తల్లిపాలల్లో ఉన్న ప్రోటీన్ కృత్రమ పాలల్లో లభించవన్నారు. గర్భిణులు పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



చల్వాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

మంగపేట: తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బోరునర్సాపురంలో శనివారం తల్లిపాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే పిల్లలకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వనజ, రుద్రమాదేవి, సరోజిని, అంజలి, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం జమున, హెచ్ఈఓ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం: విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని రామన్నగూడెం పాఠశాలలో స్వచ్ఛదనం, పచ్చదనంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సమాజంపై అవగాహన కలగడం వల్ల జరగబోయే అనర్థాలు, సంఘటనలను ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానంలో శరణ్య, ద్వితీయ స్థానంలో రోహిత్, తృతియ స్థానంలో మనిష్ నిలిచినట్లు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానంలో రక్షిత, ద్వితీయ స్థానంలో సుష్మశ్రీ, తృతీయ స్థానంలో మహేందర్‌లు నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని బీసీ మల్లిగూడెం, చర్పిపేట, నూగూరు గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్, సిబ్బంది కోటి రెడ్డి, మోహన్, రామకృష్ణ, రాజేశ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన స్నేహం అవసరం

వెంకటాపురం(కె): సమాజ నిర్మాణంలో స్వచ్ఛమైన స్నేహాలు అవసరమని మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. నేటి అధునిక సమాజంలో అత్యంత ముఖ్యమైన పాత్ర స్నేహానిది అని అన్నారు. ఉన్నతమైన స్నేహితులను ఎన్నుకోవడంలో యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాచరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజి అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాస రాజు, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ, పొన్నాడ రామకృష్ణ, రాంబాబు, రోషిత తదితరులు ఉన్నారు.



బహుమతులు అందజేస్తున్న స్వర్ణలత లెనినా

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన చెందిన జహంగీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, గుడ్ల దేవేందర్, ఖలీల్‌ఖాన్, వావిలాల నర్సింహారావు, ఎల్లయ్య, గౌస్, లాలయ్య, కరం చందు గాంది, సులేమాన్ పాల్గొన్నారు.

జాకారంలో..



అక్షిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రవీణ్

ములుగు రూరల్: మండలంలోని జాకారం గ్రామానికి చెందిన మంచోజు అక్షిత మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ శనివారం పరామర్శించి అక్షిత మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట గ్రామ కమిటీ అధ్యక్షుడు లాల్‌పాషా, కార్యకర్తలు ఉన్నారు.

మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి

ఏటూరునాగారం: అంగవైకల్యం అభివృద్ధికి ఆటంకం కాదని, మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని ఎంఈఓ సురేందర్ అన్నారు. నిజాం ఫిజియోథెరఫి హైదరాబాద్ ద్వారా శనివారం భవిత కేంద్రంలో మానసిక, అంగవైకల్యం ఉన్న పిల్లలకు పరీక్షలు, పలు కిట్లను అందజేశారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ.. పుట్టకతో అంగవైకల్యం ఉన్నప్పటికీ వారిలో మనం మనోధైర్యాన్ని నింపి వారి ఎదుగుదలకు దోహదపడాలన్నారు. ఎవరిని కూడా చిన్నతనంగా చూడవద్దని తెలిపారు. భవిత కేంద్రాన్ని దివ్యాంగుల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ పాఠశాలలోనైనా దివ్యాంగుల పిల్లలు ఉంటే భవిత కేంద్రానికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు మల్లయ్య, సాంబశివరావు, ఉపాధ్యాయలు, ఐఈఆర్‌టీ టీచర్లు స్వరూపరాణి, రమేశ్‌లు పాల్గొన్నారు.



ఎంఈఓ సురేందర్‌కు ఫిజియోథెరపీ కిట్‌ను అందజేస్తున్న ఫిజియోథెరపిస్టులు

'డ్రైవర్లను కష్టాల్లో పడేసిన ప్రభుత్వం'

గోవిందరావుపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టి ప్రైవేట్ వాహనాలు టాటా మ్యాజిక్ ఆటోలు, పలు రకాల టాక్సీ డ్రైవర్లను కష్టాల్లో పడేసిందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ పసులాది ముఖేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం టాటా మ్యాజిక్ డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల టాక్సీ డ్రైవర్ల కుటుంబాలు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం టాక్సీ డ్రైవర్లకు గౌరవ వేతనం కింద నెలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు కోయిల అజయ్, గడ్డం ప్రవీణ్, ఆటో యూనియన్ సభ్యులు సందీప్, టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు గణేష్, మేడ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పసులాది ముఖేశ్

ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పున్నం రవి

రేగొండ: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆదుకోవాలని గణపురంలో శనివారం పర్యటించిన మంత్రుల బృందానికి ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ పున్నం రవి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా జిల్లా కేంద్రంలో 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జైలు జీవితం గడిపిన ఉద్యమకారులకు పింఛన్, ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులతో పాటు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైస భిక్షపతి, పట్టెం శంకర్, గోగుల అశోక్‌రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, సామర్ల శ్రీనివాస్ ఉన్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సమ్మయ్య, నాయకులు

మంగపేట: మండల కేంద్రంలో తెలంగాణ మాల మహానాడు చలో ఢిల్లీ కరపత్రాలను మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబుతో కలిసి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు చిట్టిమళ్ల సమ్మయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. ఈ నెల 7, 8, 9న ఢిల్లీలో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షలకు మాలలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు ఆర్టికల్ 14 సమానత్వంకు భంగం కలుగుతుందని అన్నారు. మలమహానాడులు ఎవరూ కూడా ఉద్రేక, ఉద్వేగాలకు లోనుకావొద్దని, సమయనం పాటించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మాల సంఘాలు అన్ని ఏకమయ్యే సందర్భం వచ్చిందని సంఘాలన్ని కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లికొండ యాదగిరి, గంగెర్ల రాజారత్నం, మండల అధ్యక్షుడు మంచాల నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: ఏబీవీపీ నాయకులను శనివారం భూపాలపల్లి పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. జిల్లా పర్యటనకు మంత్రులు వచ్చిన సందర్భంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్న ఇప్పటి వరకు ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ములుగు రూరల్: నగదు ఇస్తున్న అహ్మద్‌పాషా



ఎస్ఎస్ తాడ్వాయి: బియ్యం ఇస్తున్న నాయకులు



వాజేడులో..



ఏటూరునాగారం: చెల్పాకలో..

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన ఎడ్ల నితిన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ అహ్మద్‌పాషా శనివారం పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ. 5 వేలను అందజేశారు. ఆయన వెంట కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు మర్రి అయిలుమల్లు, హుస్సేన్, సుధాకర్, రవి, మధుకర్, పురుషోత్తం, జీవన్, భిక్షపతి, ప్రకాష్, సంపత్ తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఊకె జగన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు పరామర్శించి కింటా బియ్యం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ నర్సింగారావు, నాయకులు కృష్ణ, నర్సయ్య, చెన్నూరు వెంకన్న, ఎండి రషీద్ తండకట్ల బాలరాజు, కన్నయ్య, అనిల్, సారయ్య పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రానికి చెందిన నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మండల ఆటో యూనియన్ యజమానులు శనివారం రూ.5000ల ఆర్థిక సాయం అందజేశారు.

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక గ్రామానికి చెందిన అట్టం పెద్ద సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శనివారం 50కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు, నాయకులు ఉన్నారు.

ఒడిపిలవంచ ఎర్ర చెరువు పరిశీలన

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నూతన కనెక్టివిటీ కోసం మండలంలోని ఒడిపిలవంచ ఎర్ర చెరువును శనివారం ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎర్ర చెరువును చిన్న కాళేశ్వరంలో ప్రాజెక్ట్ అనుసంధానం చేసి నీరు నింపాలని గతంలో పలువురు రైతులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ ఈఈ యాదగిరి, డీఈఈ ఉపేందర్ చెరువు విస్తీర్ణం, నీటి సామర్థ్యంపై క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. రైతులతో మాట్లాడి ఆయకట్టు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యోగం రాలేదని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

వాజేడు: ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్‌లోని రామన్నపేటకు చెందిన సాయికృష్ణ బీటెక్ పూర్తి చేసి ఐదు సంవత్సరాలు అవుతోంది. పరీక్షలను రాయగా ఉద్యోగం రాక పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వాజేడు, వెంకటాపురం(కె) గ్రామాల మధ్యన ఉన్న బొగ్గుల వాగు వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి మిత్రుడికి ఫోన్ చేసి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపి గడ్డి మందును తాగాడు. విషయం ఎస్సై హరీశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సాయికృష్ణ ఉన్న స్థలాన్ని ట్రేస్ చేసి 108 అంబులెన్స్‌లో ఏటూరు నాగారం ఏరియా వైద్యశాలకు అక్కడి నుంచి వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సాయి కృష్ణ కోలుకుంటున్నట్లు సమాచారం.

ప్రైవేట్ పాఠశాల టీచర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ టీచర్లు

మంగపేట: మండలంలోని కమలాపురం ఆర్ఎంసీ హైస్కూల్ ప్రైవేట్ పాఠశాల టీచర్లు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడిన చులకన భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.